పనుల్లో డొల్లతనం.. పర్యవేక్షణ శూన్యం!


లాసన్స్ బే కాలనీలో ఎత్తుపల్లాలుగా నిర్మించిన డ్రైనేజీ

- లాసన్స్ బే కాలనీలో అధ్వానంగా డ్రైనేజీ నిర్మాణం
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం.. పనుల్లో నాణ్యతా లోపం
- ముందుకు సాగని ఏబీసీ పార్క్ ఆధునికీకరణ
- చోద్యం చూస్తున్న జోన్-3 ఇంజినీరింగ్ అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని **వలు ప్రాంతా**ల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల**పై ఇంజినీరింగ్** అధికారుల పర్యవేక్షణ కొరవడింది. **లాసన్స్ బే కాల**నీలో దశాబ్దాలుగా మూతపడిన ఓ **డ్రైనేజీని ఇటీ**వల స్థానికుడి ఫిర్యాదుతో వెలికితీశా**రు. దీనిని ఆధు**నికీకరించేందుకు రూ.6 లక్షలతో **జీవీఎంసీ జోన్–3** ఇంజినీరింగ్ విభాగం పనులు చేపట్టింది. 200 మీటర్ల పరిధిలో డ్రైనేజీకి ఇరువైపులా గోడలు నిర్మించడంతోపాటు కింది భాగంలో కాంక్రీట్‌తో ప్లాట్‌ఫాం వేయాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ ఆయా పనుల్లో కనీస నాణ్యత లేకుండా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కింది భాగంలో మట్టి కూడా తీయకుండా ఇరువైపులా గోడలు నిర్మించేసి మమా అనిపించేశారు. గోడలు సైతం ఒక క్రమపద్ధతిలో కాకుండా అనేక చోట్ల ఎత్తుపల్లాలుగా నిర్మించారు. దీంతో పాటు రహదారులు ఉన్న చోట డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేయడం, మిగతా చోట ఓపెన్‌గా ఉంచడం చేయాల్సి ఉంది. దీన్ని గుత్తేదారు గాలికి వదిలేయడంతో డ్రైనేజీ ఎదురుగా ఉన్న షాపుల వారే వారికి నచ్చినట్టుగా కాంక్రీట్ పలకలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో యథావిధిగా డ్రైనేజీ మూతపడుతోంది. కేవలం 200 మీటర్ల పరిధిలో తూతూ మంత్రంగా పనులు నిర్వహించేందుకు రూ.6 లక్షలు కేటాయించిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఆయా పనులపై కనీస పర్యవేక్షణ లేకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



లాసన్స్ బే కాలనీలో పనుల అనంతరం యథావిధిగా షాపుల మధ్యలో మూతపడిన డ్రైనేజీ

ఏబీసీ పార్క్ పనుల్లో విఫలం

ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్క్ ఆధునికీకరణ పనుల నిర్వహణలో జీవీఎంసీ జోన్-3 ఇంజినీరింగ్ విభాగం విఫలమైంది. ఈ పనుల కోసం రూ.40 లక్షలను ఇంజినీరింగ్ విభాగం మంజూరు చేసింది. ఇందులో భాగంగా పార్క్ చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ట్రాక్‌కు రెండు వైపులా బ్రిక్ వాల్స్, పార్క్‌లో వివిధ శుభకార్యాల కోసం నిర్మించిన ప్రధాన వేదిక ఎక్స్‌టెన్షన్, ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. వీటితోపాటు స్థానిక చిన్నారుల కోసం చిల్డ్రన్ ప్లే ఏరియా, వాకర్స్, వృద్ధులు, మహిళల కోసం ఓపెన్ జిమ్ సముదాయాన్ని కొత్తగా ఏర్పాటు చేయాలి. గణేష్ ఇంటర్‌ప్రైజెస్ సంస్థకు ఆయా పనులను అప్పగించారు. వాటిని కాంట్రాక్టర్‌తో చేయించడంలో జోన్-3 ఇంజినీరింగ్ విభాగం పూర్తిగా విఫలమయ్యిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మే తొలి వారంలో ఈ పనులు ప్రారంభం కాగా.. వారంలోనే నిలిచిపోయాయి. గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చి ఆయా పనులు పూర్తి చేయించాల్సిన ఇంజినీరింగ్ విభాగం ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ఆయా పనుల్లో కనీస పురోగతి కరువైంది. దీంతో ఏబీసీ పార్క్ ఆధునికీకరణ ఎప్పటికీ సాధ్యమవుతుందోననే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.


ఎంవీపీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో ఆధునికీకరించాల్సిన శుభకార్యాల వేదిక


ప్రారంభంలోనే నిలిచిన ఏబీసీ పార్క్ అభివృద్ధి పనులు

లోపాలు పరిశీలిస్తాం

డ్రైనేజీ పనుల్లో నాణ్యతా లోపంపై జీవీఎంసీ జోన్-3 ఇంజినీరింగ్ ఏఈ అప్పలనాయుడిని 'సాక్షి' వివరణ కోరగా.. రూ.6 లక్షలతో డ్రైనేజీ ఆధునికీకరణ పనులు నిర్వహించినట్లు తెలిపారు. క్రమపద్ధతిలో గోడలు నిర్మించకపోవడం, ఇష్టారాజ్యంగా పలకల ఏర్పాటు, డ్రైనేజీ మళ్లీ మూతపడుతున్న అంశాలు తన దృష్టికి రాలేదన్నారు. ఆయా పనుల్లో లోపాలను పరిశీలిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థి కిట్ల పంపిణీ

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల పున:ప్రారంభం నాడే విద్యార్థులకు స్కూల్ కిట్లు అందించాల్సి ఉన్నప్పటికీ కూటమి నాయకులు అందుబాటులో లేకపోవడంతో గురువారం బ్రేక్ పడింది. పాఠశాలలు తెరుచుకున్న రెండో రోజు కూడా 1,150 మందిలో సుమారు 300 మందికి పైగా విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 20 మందికి మాత్రమే స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. మిగిలిన విద్యార్థులకు తరగతి గదుల్లో శనివారం నుంచి కిట్లు అందజేస్తామని ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని తెలిపారు. కార్యక్రమంలో 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం పాఠశాలలో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెం ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, యూనిఫారం, బెల్ట్, షూస్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.శ్రీవిద్య, స్కూల్ హెచ్‌ఎం వనిత, ఉపాధ్యాయులు జ్యోతి, జగన్, అరుణ, రమ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఎల్ అనుసంధానం తప్పనిసరి

ఎంవీపీకాలనీ: తల్లికి వందనం పథకంలో భాగంగా 9, 10 తరగతులతోపాటు ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఎల్ అనుసంధానం తప్పనిసరిగా చేయించాలని సాంఘిక సంక్షేమ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ డీడీ కె.రామారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిసెంట్లను కానీ, పోస్టల్ కార్యాలయంలో గాని, ఆయా బ్యాంకులను గాని సంప్రదించి ఈ సేవలు పొందవచ్చన్నారు. శనివారం అన్ని సచివాలయాలు, పోస్టల్ కార్యాలయాల్లో ఎన్‌పీసీఎల్ అనుసంధానం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ధనుంజయ

టీచ్‌రోడ్డు: ఓ వ్యక్తి అదృశ్యంపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చినవాల్తేరుకు చెందిన ఎస్.ధనుంజయ అనే వ్యక్తి ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి భార్య భావని భర్త సమాచారం కోసం స్నేహితులను, బంధువులను ఆరా తీసింది. ఆచూకీ లభించక పోవడంతో శుక్రవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు రేపు

సీతంపేట: ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం గల వారికి ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆయా సబ్జెక్టుల నిపుణులు నివృత్తి చేయనున్నారు.

టెన్త్ టాపర్లకు సత్కారం


విద్యార్థులు, ఎన్‌సీసీ ఆఫీసర్ విశ్వనాథంను సత్కరిస్తున్న ఎంఈవో బాలామణి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల టెన్త్ పరీక్షల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. టెన్త్ టాపర్లతోపాటు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారి బాలామణి చేతుల మీదుగా సత్కరించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం గ్రేడ్ 2 తెలుగు పండిట్ నుంచి తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా వారిని సన్మానించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ కారణంగా పలువురు విద్యార్థులు ఐఐటీ, పాలిటెక్నిక్‌లో సీట్లు లభించడంతో విశ్వనాథంను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, నిర్మల, టి.కిషోర్, వై.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తగా సింహాచలం


ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సింహాచలం

మద్దిలపాలెం: ఆంధ్ర విద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సమన్వయకర్తగా చిత్రకళ విభాగాధిపతి డి.సింహాచలం నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులను శుక్రవారం అందుకున్నారు.

ఆర్‌అండ్‌డీ విభాగం డీన్‌గా వల్లి కుమారి బాధ్యతల స్వీకరణ


ప్రొఫెసర్ వల్లి కుమారికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న ఆచార్యుడు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్‌అండ్‌డీ) విభాగం డీన్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ వి.వల్లి కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పదవీ బాధ్యతలను ఆచార్య కె.బసవయ్య అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త డీన్ వల్లి కుమారిని పలువురు ఏయూ ఆచార్యులు అభినందించారు.

'అంబేడ్కర్ ఐడియాలజీ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ తదితరులు

విశాఖ సిటీ: మోడ్రనైజింగ్ డాక్టర్ అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ సమక్షంలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. నేటితరం యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసే విధానాన్ని పుస్తకంలో వివరించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌ల ప్రగతిని సమీక్షించడానికి శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ 2024–25లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధితో పాటు 2025– 26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ సభ్యులకు వివరించారు. ఏయూలో ఏర్పాటైన అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైవిధ్యమైన కార్యక్రమాలు, ప్రజలకు, యువతకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన పరిశోధనలతో పాటు విభిన్న వర్గాలకు చేరువయ్యేలా అంబేడ్కర్ చైర్ నిర్వహించిన కార్యక్రమాలను అమిత్ యాదవ్ ప్రశంసించారు. యువతలో అంబేడ్కర్ ఆలోచనలను తీసుకెళ్లి వారిని ప్రభావితం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షకు ఏయూ తరపున ఆర్–డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి ప్రాతినిధ్యం వహించారు.

ఐక్యూఏసీ సమన్వయకర్తగా డాక్టర్ ఆనంద గజపతిరాజు


సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఆనంద గజపతిరాజు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐక్యూఏసీ సమన్వయకర్తగా జియో ఫిజిక్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆనందగజపతిరాజు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్ నుంచి ఈ బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి


18వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 18వ వార్డులో వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కోరారు. పార్టీ 18వ వార్డు సీనియర్ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మూలపాలెంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి మొల్లి అప్పారావును వార్డు నాయకులు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానన్నారు. అందరి ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమిటీ పదవుల్లో 18వ వార్డులోని అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలన్నారు. భవిష్యత్తులో అందరి కష్టానికి తగిన ప్రతిఫలం ఉండేలా తాను బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, 20వ వార్డు ఇన్‌చార్జి ముప్పల సురేష్, మాజీ కార్పొరేటర్ కొడుకుల నారాయణ, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు వాసుపల్లి యల్లాజీ, 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ దాసు, గ్రామ పెద్దలు సూరాడ దాసు, మారుపల్లి పరదేశి, కార్యకర్తలు మధు సంపతి, వాసుపల్లి అప్పలరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత

టీచ్‌రోడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి కె.నీలిమ సూచించారు. గర్భిణులు, బాలింతలు సమీప అంగన్‌వాడీ సెంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం సెక్టార్‌లోని 28వ వార్డు పందిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముఖ్య అతిథి సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత చిన్నారులతో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. పళ్లెంలో బియ్యం వేసి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లల్లో చేర్పించి, అక్కడ అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్యను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆహార తనిఖీ నకిలీ అధికారులతో జాగ్రత్త'


నందాజీ

టీచ్‌రోడ్డు: అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొందరు అపరిచితులు ఆహార తనిఖీ అధికారులమంటూ చెలామణి అవుతున్నారని ప్రాంతీయ ఆహార కల్తీ సహాయ నియంత్రణ అధికారి జి.ఎ.పి.నందాజీ అన్నారు. హోటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి బెదిరిస్తూ డబ్బు దోచుకోవడానికి పాల్పడుతున్నారని, నకిలీ అధికారుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెదవాల్తేరు జిల్లా సహాయ కల్తీ నియంత్రణ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పలు హోటళ్ల నిర్వాహకులకు అపరిచితులు ఫోన్ కాల్స్ ద్వారా తాము ఆహార కల్తీ నియంత్రణ అధికారులమని చెప్పి.. లైసెన్స్ కాలపరిమితి దాటిందని, హోటళ్ల జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయని బెదిరించి, ఫోన్‌పే చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయాలని చెప్పడంతో అనుమానం వచ్చి పలువురు హోటళ్ల నిర్వాహకులు ఆహార కల్తీ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 89189 73750 నంబర్ ద్వారా కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఈ నంబర్ గల వ్యక్తికి తమ విభాగానికి ఎటువంటి సంబంధం లేదని నందాజీ స్పష్టం చేశారు. హోటళ్ల యజమానులు ఆహార తనిఖీ నకిలీ అధికారులపై జాగ్రత్త వహించాలని కోరారు.

బీచ్ రోడ్డులో వృక్ష విలాపం


యోగా వేడుకల పేరుతో బీచ్ రోడ్డులో చల్లని నీడనిచ్చే వృక్షాలను నరికివేస్తున్నారు. బీచ్ రోడ్డు వేదికగా ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం కోసం శాంతి ఆశ్రమం నుంచి తెన్నేటి పార్కు బీచ్ రోడ్డు వరకు చెట్ల కటింగ్ పనులు చేపడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు, వాటి కొమ్మలను పొక్లెయిన్‌లతో తొలగించి, జీవీఎంసీ వాహనాల్లో వాటిని తరలిస్తున్నారు. వేసవిలో రక్షణ కల్పించే వృక్షాలను తొలగించడంపై పర్యావరణ ప్రేమికులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







రహదారి విస్తరణ ఆలోచన విరమించుకోవాలి


వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘాల ప్రతినిధులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15, 16 వార్డుల పరిధిలోని కొత్త వెంకోజీపాలెం నుంచి సీతమ్మధార వరకు ఉన్న ప్రధాన రహదారిని వెడల్పు చేసే ఆలోచనను విరమించుకోవాలని పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం, శ్రీ రాధాకృష్ణ సేవా సంఘం సభ్యులు కోరారు. ఈ విషయమై సంఘాల సభ్యులతోపాటు రోడ్డు పక్కనున్న నివాసులు శుక్రవారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో 40 అడుగుల రోడ్డును 60 అడుగులుగా విస్తరించారని, మళ్లీ ఇప్పుడు 80 అడుగులుగా విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీని వల్ల అనేక మంది నివాసాలు కోల్పోతున్నారని చైర్మన్‌కు వారంతా వివరించారు. సొంతూరిలో గూడును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. రహదారి విస్తరణకు బదులు రోడ్డును ఆక్రమించి పెడుతున్న వాహనాలు, దుకాణాలను తొలగించే చర్యలు చేపడితే సరిపోతుందని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలగదని సూచించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధురానగర్ పాఠశాల హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ


నాగజ్యోతికుమారి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా సింగంపల్లి నాగజ్యోతి కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన బి.దేముడుబాబు టౌన్ కొత్తరోడ్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. రైల్వే న్యూకాలనీ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న నాగజ్యోతి మధురానగర్ పాఠశాలకు బదిలీపై వచ్చారు.

కిరండూల్ సెక్షన్‌లో రైల్వే జీఎం పర్యటన


రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్‌వాల్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ శుక్రవారం రాయగడ డివిజన్ రైల్వే మేనేజర్ అమితాబ్ సింఘాల్‌తో కలసి కిరండూల్ సెక్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా దమన్‌జోడి–కిరండూల్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. ట్రాఫిక్, ప్రయాణికుల సదుపాయాలను జీఎం పరిశీలించారు. దమన్‌జోడి, జగదల్‌పూర్, కిరండూల్ స్టేషన్లు, రైల్వే కాలనీల్లో పర్యటించారు. అక్కడ ఆధునికీకరించిన ప్రయాణికుల సౌకర్యలను పరిశీలించారు. ప్రయాణికుల సలహాలు, అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం విండో ట్రయలింగ్ తనిఖీల ద్వారా డబ్లింగ్ పనులు, మలుపులు, వంతెనలు, టన్నెల్స్, వివిధ భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యటనలో వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బి.ఎస్.రాజకుమార్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. విరుద్దనగర్ జిల్లా తమిళనాడుకు చెందిన సెల్వన్ విశాఖ రైల్వేస్టేషన్‌కు గంజాయిని అక్రమంగా తీసుకురావడాన్ని గుర్తించారు. రూ.90 వేల విలువైన 18 కేజీల గంజాయిని సీజ్ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.